క్లుప్తంగా

నేడు అఖిలపక్ష సమావేశం

కొందుర్గు: స్థానిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయాల్లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నామని కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓలు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మండలస్థాయి అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు సమావేశానికి హాజరై ఎన్నికల విషయమై తమ అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూరు: కొత్తూరు 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు, తిమ్మాపూర్, కొత్తూరు తండా, తిమ్మాపూర్ పారిశ్రామికవాడల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయబడుతుందని, ట్రాన్స్‌కోకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

మల్లికార్జునకాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో కాలనీవాసులు

షాద్‌నగర్: పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న మల్లికార్జునకాలనీ నూతన అభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా బర్మలి జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా మంచన్‌పల్లి రమేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షులుగా ఆగీరు శ్రీనివాస్, పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బెన్నూరి రాజేశ్, గుర్రంపల్లి మల్లేశ్, కోశాధికారిగా రఘునాయక్, కార్యదర్శులుగా పరమేశ్వర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, మల్లారెడ్డి, హరీశ్, సభ్యులుగా సాయికుమార్, మధుసూదన్, సురేశ్, జగన్, వెంకటేశ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, మహేశ్, నర్సింలు తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులను కాలనీవాసులు ఘనంగా సత్కరించారు.

ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



వెంకట్‌రాంరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఎలికట్ట శ్రీఅంబాభవానీమాత దేవాలయ ఆవరణలో ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో వెంకట్‌రాంరెడ్డి సకల జనులను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆయన పోరాటాన్ని గుర్తించి ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలను అప్పగించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులను చేపట్టి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ ముత్యాలరాజు, ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ నారందినేశ్‌రెడ్డి, డైరెక్టర్లు ఆంజనేయులుగౌడ్, కుమార్, రమేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కావలి శ్రీశైలం, మాజీ వార్డు సభ్యుడు నారం శ్రీపాదరెడ్డి, నాయకులు నారం పెంటారెడ్డి, ఆర్ల యాదయ్యయాదవ్, శ్రీశైలంగౌడ్, నారంరాంరెడ్డి, రాజు, శ్రీనివాస్, కృపాదరెడ్డి, సత్తయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు పనులు త్వరగా పూర్తిచేయాలి

కొత్తూరు: పట్టణంలో డ్వాక్రా భవనం సమీపంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి షకీల్ ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. గత రెండేళ్ల క్రితం ప్రారంభమైన మార్కెట్ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. దీంతో కూరగాయాలు, చికెన్, మటన్ వ్యాపారులు రోడ్ల పక్కనే విక్రయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు ఆరోపించారు. అంతేకాకుండా ప్రతి ఆదివారం సంతలోకి వాహనాలు వెళ్లని పరిస్థితి ఉంటుందన్నారు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే వ్యాపారులు అక్కడ అన్ని సదుపాయాలతో వ్యాపారం నిర్వహించుకునే వీలుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

ట్రాఫిక్‌తో నిత్యం సతమతం

- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- ఇరువైపులా చిరువ్యాపారాల నిర్వహణ
- వాహనాల రాకపోకలకు అంతరాయం
- ఛలాన్లకే పరిమితమవుతున్న పోలీసులు



పట్టణంలో ఎస్‌బీఐ ఎదుట రెండు వరుసలుగా నిలిపిన వాహనాలు

కొత్తూరు: పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు సతమవుతున్నారు. వాహనాల వినియోగం పెరగడంతో వివిధ గ్రామాల నుంచి వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లతో రాకపోకలు పెరిగాయి. మరోవైపు ఆటోలు, ఇతర సరుకు రవాణా వాహనాల తాకిడి కూడా పట్టణానికి పెరిగింది. దీంతో నిత్యం ప్రధాన కూడళ్లలో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోడ్లపైనే అడ్డంగా తోపుడు బండ్లు, ఆటోలు, పండ్ల దుకాణాలు ఉంటున్నా పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు

రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ప్రధానంగా మారింది. స్థానికంగా పారిశ్రామికవాడ ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు మండల కేంద్రం నుంచి రాకపోకలు కొనసాగిస్తుంటాయి. దానికి తోడు మండలం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే వాహనాల సంఖ్య కూడా వందల్లోనే ఉంటుంది. ఏమాత్రం రోడ్డుపై ఆటోలు, జీపులు నిలిపినా నిమిషాల వ్యవధిలోనే పదుల సంఖ్యలో వాహనాలు ఆగిపోతున్నాయి. ముఖ్యంగా కొత్తూరు–షాద్‌నగర్ పాత జాతీయ రహదారి, కొత్తూరు–జేపీదర్గా, కొత్తూరు–పెంజర్ల రోడ్డులో ట్రాఫిక్ సమస్య మరింతగా పెరుగుతోంది.

ఇష్టారాజ్యంగా పార్కింగ్..

స్థానికులతో పాటు ఆయా ప్రాంతాల నుంచి పలు దుకాణాలు, ఇతర పనుల నిమిత్తం వచ్చే వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. కొందరు దుకాణాల నిర్వాహకులు కూడా రోడ్డు సమీపం వరకు తోపుడు బండ్లు, టీ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అసలే సింగిల్ రోడ్డు కావడంతో వీటి నిర్వహణతో రోడ్డు మరింత ఇరుకుగా మారుతోంది. దానికి తోడు జేపీదర్గా, పెంజర్ల, షాద్‌నగర్ వైపునకు వెళ్లే ఆటో, జీపు డ్రైవర్లు ప్రయాణికులను ఎక్కించుకోవడానికి పోటీలు పడి వాహనాలను రోడ్డు మధ్యలో నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. ఈ సమస్యపై తరచూ పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



పెంజర్ల రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత



శ్రీఅంబాభవానీమాత దేవాలయాన్ని మూసివేస్తున్న అర్చకుడు మల్లేశ్

షాద్‌నగర్‌రూరల్: భాద్రపద శుక్ల పౌర్ణమిని పురస్కరించుకొని సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా దేవాలయాలను ఆదివారం అర్చకులు మూసివేశారు. పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, మండల పరిధిలోని రామేశ్వరంలోని ఉత్తర రామలింగేశ్వస్వామి దేవాలయం, మొగిలిగిద్ద సమీపంలోని శ్రీగోదారంగనాయకస్వామి దేవాలయాలను మధ్యాహ్నం 12:30 గంటలకు, ఎలికట్ట శ్రీఅంబాభవానీమాత దేవాలయం మధ్యాహ్నం 3:30గంటలకు అర్చకులు మూసివేశారు. గ్రహణం రాత్రి 9:56 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి 01:26 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రహణ సమయానికి ముందుగానే భోజనం చేయాలని, తదుపరి చేయరాదని వివరించారు. సోమవారం ఆలయ సంప్రోక్షణ, అభిషేకం తర్వాత ఉదయం 8 గంటలకు అన్ని దేవాలయాల్లో భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తామని ఈఓ శివకుమార్ స్పష్టం చేశారు. ఈ సంపూర్ణ చంద్రగ్రహణం భారతదేశంలోని అన్ని ప్రాంతాల్లో కనిపిస్తుందని తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న నాయకులు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

శంకర్‌పల్లి: గత రెండు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పంచాయతీ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే, వారి జీవితం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. చాలీచాలని వేతనాలతో వారు వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ నెల వేతనాలు రాకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. అదేవిధంగా ఈ నెల 16న షాబాద్ మండలం నాగర్‌గూడలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో నిర్వహించనున్న జిల్లా గ్రామ పంచాయతీ యూనియన్ మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు, నాయకులు మల్లేశ్, యాదయ్య, అమృత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల తగ్గింపుతో ప్రజలకు మేలు



శంకర్‌పల్లి చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులలో పెద్దఎత్తున మార్పులు చేసి, పన్నులు తగ్గించడం ప్రజలకు ఎంతో మేలుచేసే అంశమని పట్టణ బీజేపీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణ చౌరస్తాలో వారు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, ప్రధాని మోదీకి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మున్సిపల్, మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, లీలావతి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వదేశీ వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు ఎన్నో సంస్కరణలు చేపడుతోందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ పాలన కొనసాగిస్తున్నారన్నారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాములు, వాసుదేవ్ కన్నా, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పండిత్‌రావు, దండు రామ్మోహన్, నర్సింలు, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్, శ్రీకాంత్‌రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మొయినాబాద్‌రూరల్: మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నగరంలోని ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాన్ని 9 గంటలకు ప్రారంభించనున్నట్లు, గుండె, కేన్సర్ తదితర స్కానింగ్‌లతో పాటు వివిధ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. దీనిని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు యూరియా అందించడంలో విఫలం

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి

మొయినాబాద్: రైతులకు సరిపడా యూరియా అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి విమర్శించారు. ఆదివారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యూరియా కోసం ప్రతి రోజు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. నెల రోజులకుపైగా రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టడంలేదని మండిపడ్డారు. సీజన్‌కు ముందే సరిపడా యూరియాను అందుబాటులో పెట్టాల్సిన సీజన్ దాటిపోతున్నా అందించలేకపోతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రతి రోజు రైతులు ఎరువుల కోసం పీఏసీఎస్‌లు, ఫర్టిలైజర్ షాపుల వద్ద బారులు తీరుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు రైతులకు అనేక రకాల హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. రుణమాఫీ, రైతు భరోసా రైతులందరికీ ఇవ్వలేదని మండిపడ్డారు.

రైతులందరికీ సరిపడా ఎరువులు

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్

మొయినాబాద్‌రూరల్: రైతులు వేసుకున్న పంటలకు ప్రభుత్వం ద్వారా సరిపడా ఎరువులను సరఫరా చేస్తారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడంతో విఫలమైందని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పదేపదే మాట్లాడడం సరైంది కాదన్నారు. కేంద్రం ద్వారా వస్తున్న ఎరువులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మండలాల వారీగా పంపిణీ చేస్తోందన్నారు. మొయినాబాద్‌లో రైతులు క్యూలో ఉన్నప్పటికీ వారికి అధికారులు సూచనలు, సలహాలు ఇస్తూ ప్రభుత్వం ద్వారా వచ్చిన ఎరువుల పంపిణీ చేస్తున్నారన్నారు. అధికంగా రైతులు రావడంతో యూరియా బస్తాలు సరిపోక అందరికీ అందలేకపోతోందన్నారు. తిరిగి మళ్లీ స్టాక్ రాగానే అధికారులు వెంటనే పంపిణీ చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న ఈ ఎరువులు రాష్ట్ర ప్రభుత్వానికి ఆలస్యంగా వస్తున్నాయన్నారు. దీనిని రైతులు దృష్టిలో పెట్టుకొని నిరాశకు గురి కావొద్దని సూచించారు. రైతుల ప్రభుత్వం కాంగ్రెస్ అని, వారి సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

రైతు వేదికల్లోనే యూరియా పంపిణీ

ఏఓ నిషాంత్‌కుమార్



మాట్లాడుతున్న ఏఓ నిషాంత్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు రైతు వేదికల్లో సోమవారం యూరియాను సరఫరా చేస్తామని మండల వ్యవసాయాధికారి(ఏఓ) నిషాంత్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు ఎరువులు అందజేస్తామన్నారు. మండల పరిధిలో ఎలికట్ట, వెలిజర్ల, చించోడ్, బూర్గుల, మధురాపూర్ రైతు వేదికలలో 200ల చొప్పున యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, సోమవారం యూరియా పంపిణీ చేస్తామని తెలిపారు. ఫరూఖ్‌నగర్, ఎలికట్ట, మొగిలిగిద్ద, ఎల్లంపల్లి, నాగులపల్లి, హాజిపల్లి, గుండ్లకుంట, కిషన్‌నగర్ రెవెన్యూ గ్రామాల్లోని రైతులు ఎలికట్ట రైతు వేదికలో తీసుకోవాలని సూచించారు. వెలిజర్ల, సూర్యారావుగూడ, కొండన్నగూడ, కొంగగూడ, చటాన్‌పల్లి, బుచ్చిగూడ, దూసకల్ రెవెన్యూ గ్రామాల రైతులకు వెలిజర్ల రైతు వేదికలో యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. చించోడ్, చౌలపల్లి, భీమారం, కంసాన్‌పల్లి, కందివనం రెవెన్యూ గ్రామాల రైతులు చించోడ్ రైతు వేదిక వద్ద తీసుకోవాలని తెలిపారు. బూర్గుల, తిమ్మాజిపల్లి, అన్నారం, జోగమ్మగూడ, రాయికల్, విఠ్యాల, మధురాపూర్, శేరిగూడ, గంట్లవెల్లి, కమ్మదనం, చిల్కమర్రి, సోలీపూర్, రామకృష్ణాపూర్ రెవెన్యూ గ్రామాల రైతులు పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియాను తీసుకోవాలన్నారు. ఈ నెల 6వ తేదీవరకు టోకెన్లు తీసుకున్న రైతులు మాత్రమే ఆయా రైతు వేదికల్లో సోమవారం యూరియా తీసుకునేందుకు రావాలని తెలిపారు. రైతులు టోకెన్, ఒరిజినల్ పట్టా పాసుబుక్, ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకొని రావాలని, క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాలలో యూరియాను తీసుకోవాలని సూచించారు. యూరియా సరఫరాలో రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే మీ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ)ని సంప్రదించాలని కోరారు.

కేబుల్ వైర్లపై చెట్టు కొమ్మ



వైర్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న చెట్టు కొమ్మ

చేవెళ్ల: విద్యుత్ వైర్లకు తగులుతోందని చెట్టు కొమ్మను కొట్టి కేబుల్ వైర్లపై పడేశారు. మున్సిపాలిటీలో ఐదురోజుల క్రితం విద్యుత్ అధికారులు నిమజ్జన సమయంలో రోడ్ల వెంట విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగిలి ఇబ్బంది కాకుడదని కొమ్మలు కొట్టారు. అలా కొట్టిన ఓ పెద్ద చెట్టు కొమ్మ చేవెళ్ల విలేజ్ రోడ్డులోని అంగడిబజారుకాలనీకి వెళ్లే దారిలో ఐదురోజులుగా కేబుల్ వైర్లపైనే వేలాడుతూ కనిపిస్తోంది. ఈ కొమ్మ పెద్దదిగా ఉండటంతో అటూ ఇటూ కదులుతూ కాలనీలోకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా మారింది. చెట్టు కొమ్మలు నరికివేసే సమయంలోనే కొమ్మలను పక్కకు లాగాల్సిన విద్యుత్ సిబ్బంది, కూలీలు అలాగే వదిలేయటంతో ఇలా అందరికీ ఇబ్బందిగా మారిపోయింది. దీనిని విద్యుత్ అధికారులు, మున్సిపల్ అధికారులు మాకేమీ సంబంధం లేదన్నట్లుగా ఉండిపోయారు. దీంతో ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పటం లేదు. గాలికి రోడ్డుపై వచ్చే వాహనదారులపై పడితే మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎవరైనా స్పందించి దీనిని తొలగించాలని కోరుతున్నారు.



షాద్‌నగర్‌రూరల్: ఎలికట్టలో రూ.1.56లక్షలకు లడ్డూ దక్కించుకున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు కావలి శ్రీశైలం



షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో హరినాయక్‌కు గణనాథుడి లడ్డూ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వైభవోపేతం.. నిమజ్జనోత్సవం

గణేశ్ నిమజ్జనోత్సవం శనివారం రాత్రి చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో కనుల పండువగా జరిగింది. నవరాత్రులు పూజలందుకున్న గణనాథుల నిమజ్జనానికి నిర్వాహకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్యాండు మేళాలు, సంప్రదాయ నృత్యాల మధ్య ఉండ్రాలయ్యను గంగమ్మ ఒడికి సాగ నంపారు. గణపతి బప్పా మోరియా .. ఆదా లడ్డూ చోరియా అంటూ భక్తులు హోరెత్తిన నినాదాలతో గణపయ్యకు వీడ్కోలు పలికారు.



షాద్‌నగర్‌రూరల్: వినాయకుడి నిమజ్జన శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, యువకులు



మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లిలో రూ.2.66లక్షలకు లడ్డూ కైవసం చేసుకున్న భాస్కర్



షాద్‌నగర్: న్యూసిటీ కాలనీలో రూ.1.25లక్షలకు లడ్డూ దక్కించుకున్న ఎల్కుర్తి నారాయణ

విద్యార్థులకు గ్రేడింగ్ పరీక్షలు



బెల్ట్‌లు, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

కొందుర్గు: మండల కేంద్రంలోని జీఎం పటేల్ గార్డెన్‌లో సోమవారం న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటేలో పరీక్షలు నిర్వహించి గ్రేడ్‌లను నిర్ధారించారు. ఈ పరీక్షలకు వివిధ మండలాలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా 20 మంది విద్యార్థులకు గ్రీన్ బెల్ట్, 10 మందికి ఆరెంజ్ బెల్ట్, 10 మంది విద్యార్థులకు ఎల్లో బెల్ట్‌లకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి ఫౌండర్ అండ్ టెక్ డైరెక్టర్ ఖాజాపాషా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బెల్ట్‌లు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాస్టర్లు రామ్, సత్యం, యోగేశ్ యాదవ్, బాలకృష్ణ, గిరి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.